క్లుప్తంగా

ఘనంగా వీరభద్రస్వామి రథోత్సవం



ఎద్దులదొడ్డిలో వీరభద్రస్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో వెలసిన శ్రీ వీరభద్రస్వామి రథోత్సవ వేడుకలు ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామి ఉత్సవ మూర్తులను పూలతో అలంకరించిన రథంలో ఉంచి మేళతాలాలతో రథాన్నిలాగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పత్తికొండ రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


సేవాగుణం.. అభినందనీయం



కంబాలపాడు- కోయిలకొండ రహదారిలో కంప చెట్ల తొలగింపు పనులు చేపట్టిన దృశ్యం

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ లక్ష్మీకాంతరెడ్డి సేవాగుణాన్ని పలువురు అభినందిస్తున్నారు. ఇది వరకే తన స్వగ్రామంలో శ్మశాన వాటికకు రహదారి ఏర్పాటుతోపాటు, కంబాలపాడు నుంచి చుంచుఎర్రగుడి వరకు 7 కిలోమీటర్ల రహదారికి ఇరువైపుల కంప చెట్లు తొలగించారు. తాజాగా పోలీసుల వారి విజ్ఞప్తి మేరకు ఆదివారం కంబాలపాడు నుంచి కోయిలకొండకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కంప చెట్ల తొలగింపునకు పూనుకున్నాడు. దీన్ని గమనించి ఆయా గ్రామాల ప్రజలు లక్ష్మీకాంతరెడ్డిని మెచ్చుకుంటున్నారు.

రేపు గంజిహాళ్లిలో నెల ఉరుసు



బడేసాహెబ్ తాత దర్గా

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహాళ్లి గ్రామంలో వెలసిన శ్రీ మహాత్మ బడేసాహెబ్ తాత నెల ఉరుసు మహోత్సవం మంగళవారం జరగనున్నట్లు దర్గా ధర్మకర్త కుబేర్‌రెడ్డి, పీఠాధిపతి సయ్యద్ చిన్న ముద్గోల్ ఆదివారం తెలిపారు. ఉదయం నుంచే భక్తులు వేల సంఖ్యలో హాజరై పూజలు నిర్వహిస్తారన్నారు.

బండ లాగుడు పోటీలు :
నెల ఉరుసు సందర్భంగా ఉదయం రాష్ట్ర స్థాయి న్యూ క్యాటగిరీ ఎద్దుల బండ లాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.50వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20వేలు, రూ.10వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు రూ.600 ప్రవేశ రుసుం చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా సాయంత్రం జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 9441181021, 9666030606, 7989728402 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహిళలపై దాడులు అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న వి.జయలక్ష్మి

ఎమ్మిగనూరుటౌన్: దేశంలో మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని, వీటిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి.జయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో ఏపీ మహిళా సమాఖ్య పట్టణ జనరల్ బాడి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల తెలంగాణలో వైద్య విద్యార్థినిని ర్యాగింగ్ పేరుతో హత్య చేయడం జరిగిందని, ఇలా దేశంలో ప్రతి రోజు మహిళలపై జరుగుతున్న హత్యలు, దాడులను అరికట్టాలన్నారు. అనంతరం ఏపీ మహిళా సమాఖ్య పట్టణ నూతన కమిటీ ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలిగా కృష్ణవేణి, అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఈశ్వరమ్మ, నాగవేణి, సరోజ, సహాయ కార్యదర్శులుగా లక్ష్మి, కృష్ణమ్మతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సమాఖ్య నాయకులు ఈరమ్మ, సీపీఐ నాయకులు పంపణ్ణగౌడ్, బాలరాజు, సత్యన్న, బజారి తదితరులు పాల్గొన్నారు.

30న శ్రీరామనవమి వేడుకలు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీన శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వన్నె తగ్గిన 'పచ్చ బంగారం'

- ఏటా తగ్గుతున్న పసుపు సాగు విస్తీర్ణం
- వైఎస్‌ఆర్ హయాంలో లభాలు చూసిన రైతులు
- ఆ తర్వాత దిగుబడులు రాక, గిట్టుబాటు ధరల్లేక నష్టాలే
- గతంలో పత్తికొండ నియోజకవర్గంలో 500 ఎకరాలకు పైగా సాగు
- ప్రస్తుతం 37 ఎకరాలకు పరిమితమైన పంట



బోయనపల్లె పరిధిలో పసుపు కొమ్ములను బ్రాయిలర్లలో ఉడకబెడుతున్న దృశ్యం

వెల్దుర్తి: 'పచ్చ బంగారం'గా పిలిచే పసుపు సాగు ఏటేటా తగ్గిపోతోంది. సాగు ఖర్చులు పెరిగిపోతుండటం, తెగుళ్ల బెడద, దీర్ఘకాలిక పంట కావడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు పంట సాగుకు ఆసక్తి చూపడం లేదు. తక్కువ కాలంలో వచ్చే వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో పత్తికొండ నియోజకవర్గంలో బోర్లు, బావుల కింద 500 ఎకరాలు పైబడి సాగయ్యే పసుపు, గతేడాది 100 ఎకరాలకు పడిపోయింది. ఈ ఏడాది అది కాస్తా 37 ఎకరాలకు ఆగిపోయింది. అది కూడా మొత్తం వెల్దుర్తి మండలంలో సాగు చేసిందే. మండల పరిధిలోని బోయనపల్లెలో 27 ఎకరాలు, నర్సాపురంలో 4.2 ఎకరాలు, రామళ్లకోట, కలుగొట్లలో రెండేసి ఎకరాలు, సర్పరాజాపురంలో 1.4ఎకరాల్లో సాగైంది.

ఎకరాకు రూ.లక్షకు మించి ఖర్చు :
పసుపు కొమ్ము పారాణి నుంచి వంట వరకు, మందుల తయారీకి ఎంతో ఉపయోగపడుతుంది. సాగు చేసే రైతులకు మాత్రం నష్టాలు మిగుల్చుతోంది. పసుపు సాగు ఏడాది కాలం పంట. నీటి వినియోగం ఎక్కువే. దుక్కి దున్నే దశ నుంచి ఎరువులు, మందులు వేసి తెగుళ్ల, ప్రకృతి వైపరీత్యాలు దాటుకుని పంట తవ్వితీసి, ఉడకబెట్టి, ఆరబెట్టి, అమ్మకం జరిగే నాటికి రైతులకు ఎకరాకు రూ.లక్షకు మించి ఖర్చవుతోంది. కౌలు కూడా కలిపితే రూ.లక్షన్నర దాటుతుంది.

తగ్గుతున్న దిగుబడులు :
దిగుబడులలో ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల వచ్చి, ధర క్వింటం కనీసం రూ.8వేలు ఉంటే రైతుకు కలిసొస్తుంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మాత్రమే మంచి దిగుబడులు రావడం, క్వింట ధర రూ.14వేల నుంచి రూ.15వేలు లభించడంతో లాభాలు పొందారు. ఆ తర్వాత ఏటా దిగుబడులతోపాటు ధరలు తగ్గుతూ వస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో 2016 సంవత్సరంలో క్వింటం రూ.9 వేలకు చేరుకున్నా దిగుబడులు ఆశాజనకంగా రాలేదు. 2017, 2018 సంవత్సరాల్లో పంట తెగుళ్ల బారిన పడడంతో పాటు క్వింట రూ.4 వేలు మాత్రమే పలకడంతో రైతులు నష్టాలు చూశారు. 2019లో రూ.5వేలు పలకగా, 2020 నుంచి గతేడాది వరకు మార్కెట్‌లో రూ.6 వేలలోపే కొనసాగింది. 2020లో ప్రభుత్వం పసుపును క్వింటం రూ.6,850ల మద్దతు ధరతో ఒక్కో రైతు నుంచి గరిష్టంగా 40 క్వింటాళ్లు సేకరించింది. నంద్యాలలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుతో మండల పసుపు రైతులు ఆ సంవత్సరం ఎకరాకు రూ.50 వేలకు పైబడి లాభాలార్జించారు. తర్వాత నుంచి కరోనా ప్రభావంతో నష్టాలను చవిచూస్తున్నారు. ఈ ఏడాది సైతం మార్కెట్‌లో క్వింట ధర రూ.5,200ల నుంచి ఉందని రైతులు వాపోతున్నారు. రాష్ట్రంలోని ప్రఖ్యాత దుగ్గిరాల పసుపు మార్కెట్‌లో ప్రస్తుతం క్వింట రూ.6,500లోపు కొనసాగుతోంది. అది కూడా పూర్తి నాణ్యతతో ఉంటేనే గరిష్ట ధర లభించడం కష్టం. గతేడాది జూన్‌లో పసుపు సాగు చేసిన రైతులు దిగుబడులను పొలాల్లో, ఇళ్ల వద్ద ఉంచుకుని గిట్టుబాటు ధర కోసం ఎదురు చూస్తున్నారు.

ఖర్చులు తగ్గించేందుకు యంత్రాలు ఇస్తాం

పసుపు సాగయ్యే బోయనపల్లె, రామళ్లకోట ప్రాంత పొలాలను వ్యవసాయ శాఖ, ఆర్బీకే సిబ్బందితో కలిసి పలుమార్లు పరిశీలించి రైతులకు సూచనలిచ్చాం. అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. పసుపు రైతుల సమస్యలు ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం రైతులు కోరితే ప్రభుత్వం పసుపు సాగులో కూలీల ఖర్చులు తగ్గించేందుకు అవసరమయ్యే యంత్రాలు (బాయిలర్లు, గ్రేడింగ్, పాడరింగ్, పాలిషింగ్ మెషిన్లు) 60 శాతం నుంచి 75శాతం సబ్సిడీతో అందించేందుకు సిద్ధంగా ఉంది. – విజయలక్ష్మి, హార్టికల్చర్ ఆఫీసర్, కర్నూలు

ఇప్పుడున్న ధరకు అమ్మితే నష్టమే



ఈ ఏడాది దుగ్గిరాల, కడప, నిజామాబాద్ మార్కెట్లలో క్వింట పసుపుకొమ్ములకు రూ.5.200ల నుంచి రూ.6,500ల వరకు ధర ఉన్నట్లు తెలుస్తోంది. మా ప్రాంతంలో సాగుచేసేది సుగంధం రకం, నాణ్యమైన పంట. ఈ ఏడాది తెగుళ్ల తక్కువైనా నాకు ఎకరాకు రూ.లక్షన్నర ఖర్చయింది. 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇప్పుడున్న బయటి మార్కెట్ ధరకు అమ్మితే నష్టమే. ప్రభుత్వం పసుపు రైతును ఆదుకునేలా గిట్టుబాటు ధర కనీసం రూ.8 వేలు కల్పించి, ప్రతి ఆర్బీకేలో కొనేలా చర్యలు తీసుకోవాలి.
– వంగూరు కిశోర్‌రెడ్డి, బోయనపల్లె

ధరలు లేక సాగు తగ్గించాం



పసుపు 9నెలల దీర్ఘకాల పంటనే కాకుండా అంతర్గత పంటలకు అవకాశం ఉండదు. పెట్టుబడి ఎక్కువే. ప్రతి ఏడాది ఏదో రకంగా నష్టాలు చూస్తున్నాం. దీంతో సాగును తగ్గించాం. నేను ఈ ఏడాది ముక్కాలు ఎకరా (0.75 ఎకరాలు) మాత్రమే సాగు చేశాను. ప్రస్తుతం దిగుబడులను ఉడకబెట్టే ప్రక్రియలో ఉన్నాను. మొత్తంగా దిగుబడి 9 క్వింటాళ్లలోపు వచ్చే అవకాశం ఉంది. ఖర్చుతో పోల్చుకుంటే నష్టాలు తప్పవు. – శ్రీరాములు, బోయనపల్లె

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఆలూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా, కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ లలిత ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆలూరు ప్రాజెక్టు పరిధిలోని ఆలూరు మండలం అరికెర అంగన్‌వాడీ సెంటర్-3లో 1 ఆయా పోస్టు (ఎస్టీ రిజర్వు), ఆస్పరి మండలం ముత్తుకూరు సెంటర్-2లో ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఒక ఆయా పోస్టు, చిప్పగిరి మండం గుమ్మనూరు అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యకర్తగా పనిచేసేందుకు బీసీ-డి కేటగిరి కింద ఒక ఖాళీ, ఏరూరు గ్రామ సెంటర్-1 ఓసీ రిజర్వేషన్ కింద ఒక పోస్టు ఉందన్నారు. ఆయా పోస్టుకు 7వ తరగతి, కార్యకర్త పోస్టుకు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 01.07.2022 నాటికి 21 సంవత్సరాలు పూర్తి చేసుకుని 35 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఈనెల 29 తేది సాయంత్రం 5 గంటల లోపు ఆలూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

28న కౌలు రైతుల రాష్ట్ర సదస్సు

ఎమ్మిగనూరుటౌన్: కౌలు రైతుల రాష్ట్ర సదస్సు ఈ నెల 28న విజయవాడలో జరుగనుందని, ఈ సదస్సుకు స్థానిక కౌలు రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పంపణ్ణగౌడ్, తిమ్మయ్యలు కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌలు రైతుల సమావేశంలో వారు మాట్లాడారు. జీఓ నెంబర్ 96ను అనుసరించి కౌలు రైతులందరికి రైతు భరోసా కింద ఎకరాకు రూ.10వేలు, 55 సంవత్సరాలు పైబడిన వారికి పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు సత్యన్న, జబ్బార్, శాంతన్న, బాలరాజు, భాస్కర్‌యాదవ్, ఖాజలు పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మోహన్ రెడ్డి

గోనెగండ్ల: ఏప్రిల్ నెలలో జరిగే రంజాన్ పండుగను మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మిగనూరు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి సూచించారు. ఆదివారం సాయంత్రం గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దలు, గ్రామ పెద్దలతో ఎస్ఐ పి.తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ వేడుకల్లో ఎలాంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా సామాజిక మాధ్యమాల్లో ప్రజలను రెచ్చగొట్టే మేసేజ్‌లు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కుల మతాలను దూషించడం, కించపరచే మేసేజ్ చేసిన, మరొకరికి ఫార్వర్డ్ చేసిన సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు తిమ్మారెడ్డి, వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, భాస్కర్ రెడ్డి, చికెన్ రాజా, డాక్టర్ శివరాం, దాదావలి, ఉసేన్ పటేల్, జలీల్, యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

హొళగుంద: హొళగుంద-బళ్లారి రోడ్డులోని తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. మూడడుగుల ఎత్తు కూడా లేని కట్టపై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంవల్ల పిల్లలకు కూడా చేతికందేలా ఉంది. వేసవి కావడం వల్ల కాలువలో ఈత కొట్టేందుకు పెద్ద సంఖ్యలో పిల్లలు, పెద్దలు వస్తుంటారు. దీంతో అదమరిచి ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికెళ్లి ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎర్త్‌వైర్‌కు విద్యుత్ సరఫరా జరిగి పాడిగేదె మృతి చెందింది. ఇతర ప్రమాదాలు కూడా జరిగాయి. వెంటనే సంబంధిత అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు మార్చడం లేదా ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భక్తి మార్గంలో నడవాలి




ఎల్లార్తిలో పురాణ కార్యక్రమంలో స్వామిని సత్కరిస్తున్న మహిళలు

హొళగుంద: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని, అప్పుడే వారికి, సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని జంగమర హొసళ్లికి చెందిన అజాత శంభులింగ శివాచార్య స్వామి అన్నారు. ఆదివారం ఎల్లార్తి గ్రామంలో శివశరణి మహాసాధ్వీ హేమరెడ్డి మల్లమ్మ పురాణ ప్రవచన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విశ్వారాధ్యశాస్త్రీ అనే పండితులు భక్తులకు పురాణాన్ని చదివి వినిపించారు. అంతకు ముందు వీరశైవ లింగాయత్‌లు గ్రామంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ముత్తైదువులకు సామూహిక వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. అజాత శంభులింగ శివాచార్య, ఇతర మహాస్వాములు భక్తులకు ధర్మ సందేశాన్ని ఇచ్చారు. దాన ధర్మాలు చేయడం, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం వల్ల ఎంతో పుణ్యం కలుగుతుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

హొళగుంద: ఎండకాలంలో ప్రజలు వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని హొళగుంద ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి న్యూటన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ..రోజురోజుకు ఎండలు ఎక్కువ అవుతున్నాయన్నారు. ప్రజలు తెల్లటి నూలు లేదా లేతరంగు వస్త్రాలు ధరించాలని, జీన్స్ లాంటి బిగుతు వస్త్రాలు, మందం దుస్తులు వాడరాదని సూచించారు. ఎండలో అధికంగా తిరగడం, మద్యం, మాంసం, రంగుల పానీయాలు తీసుకోవడం, గుట్కాలు నమలడం చేసే వారితో పాటు పొలాల్లో పని చేసే వారికి ఎక్కువగా వడదెబ్బ తగులుతుందన్నారు. అలసట, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, అధిక జ్వరం, వాంతులు, విరేచనాలు, కళ్లుతిరగడం, స్పృహ కోల్పోవడం, 105 డిగ్రీలకన్నా జ్వరం ఎక్కువ ఉండడం, మూత్రం రంగు మారడం జరుగుతుందన్నారు. వృద్ధులు, చిన్న పిల్లలకు వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువ ఉంటుందన్నారు. మద్యం, మాంసహారం తగ్గించి కాయగూరలు, కొబ్బరి నీళ్ల, పళ్ల రసాలు అధికంగా తీసుకోవాలన్నారు. రోజుకు కనీసం 15 గ్లాసు నీళ్ల తాగాలని, మిత భోజనం చేయాలన్నారు. నీడలోనే ఉంటూ పనులు చేయాలని, వడదెబ్బ తగిలిన వారికి వెంటనే వైద్య చికిత్సలు చేయకపోతే ప్రాణహాని కలిగే అవకాశం ఉందని చెప్పారు.

ఇది ఆర్టీసీ బస్టాండే!



ఆర్టీసీ బస్టాండ్ చుట్టూ ఆటోలు నిలిపిన దృశ్యం

ఆలూరు: స్థానిక పాతబస్టాండ్ సమీపంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండు ఆటోస్టాండ్‌గా మారింది. బస్టాండ్‌కు ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, అనంతపురం జిల్లా గుంతకల్లు, రాయదర్గం, బళ్లారి తదతర ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఆటోవాలాలు అక్కడే ప్యాసింజర్ల కోసం వాహనాలను ఆపుతున్నారు. దీంతో బస్సుల రాకపోకలకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ఆటోలు బస్టాండ్ వద్ద ఆపకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముజఫర్‌నగర్‌లో చోరీ

కర్నూలు(సెంట్రల్): ముజఫర్ నగర్‌లోని వసంత నగర్‌లో చోరీ జరిగింది. వివరాలు.. వసంత నగర్‌లో నివాసం ఉంటుంటున్న సోమశేఖర్‌గౌడ్ ఈ నెల 16వ తేదీన నంద్యాల సమీపంలోని గాజులపల్లెకు వెళ్లాడు. అక్కడే ఈ నెల 19వ తేదీ వరకు ఉండి తిరిగి వచ్చాడు. అయితే అప్పటికే దొంగలు ఆయన ఇంటి వెనుకాల ఉన్న డోర్‌ను పగులగొట్టి లోపలికి ప్రవేశించి బిరువాలోని మూడు తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. చివరకు చేసేదేమిలేక శనివారం నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారణ జరుపుతున్నారు.

ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులకు పత్యేక పూజలు జరిగాయి. స్వామివారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని దర్శించుకోవడానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. పూజారులు ఆలయంలో మూల విరాట్‌మూర్తులకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం,బండరార్చన,కుంకుమార్చన,అభిషేకాలు తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

28న వాహనాల వేలం

ఆలూరు: స్థానిక సెబ్ పోలీసు సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 28న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ పీఈ వెంకట్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు సమక్షంలో వేలం పాటలు జరుగుతాయన్నారు. ముందుగా పాటదారులు రూ.5 వేలు నగదు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

28న సంగాలలో కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని సంగాల గ్రామంలో ఈ నెల 28న అంతర్ రాష్ట్ర హోమ్ టీమ్స్ బాలుర కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి దాతల సహకారంతో వరుసగా రూ.25వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలను అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమాదు చేసుకోవాలన్నారు. క్రీడాకారులకు భోజన సౌకర్యం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 63001 93498, 98492 44695, 63021 91524 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: రైతు, రైతుకూలీల సమస్యలపై ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక, రైతు సంఘ, సీఐటీయూ నాయకులు హనుమంతు, తిమ్మన్న, రాముడులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను, కూలీలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదని ఆరోపించారు. వ్యవసాయ కూలీలకు గ్రామాల్లోనే ఉపాధి కల్పించి రోజు వేతనం రూ.600లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, అబ్దుల్లా, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్తం

6070 మందికి వైఎస్సార్ ఆసరా
మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న 554 గ్రూపులకు సంబంధించి 6070 మంది పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం 3వ విడత కింద రూ.3.60 కోట్లు మంజూరైనట్లు వైకేపీ ఏపీఎం సూర్యప్రకాష్ తెలిపారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు
కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ (సాంఘిక సంక్షేమ)గురుకుల బాలికల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల దరఖాస్తు గడువును ఈ నెల 31వరకు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24తో గడువు ముగిసినా ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చిందన్నారు. 2022-23లో నాల్గవ తరగతి చదువుతున్న వారు ఐదవ తరగతికి, ఇదే ఏడాదిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

4లోపు దరఖాస్తు చేసుకోండి
మద్దికెర: మహాత్మ జ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 5వ తరగతి ప్రవేశానికి ఏప్రిల్ 4వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ రంగస్వామి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 16వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

నేడు 'స్పందన' కార్యక్రమం
కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ పురుషోత్తం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరు తప్పక హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

31న బండలాగుడు పోటీలు
కృష్ణగిరి: మండలంలోని పెనుమాడ గ్రామంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ఈ నెల 31న పాలపళ్ల ఎద్దులకు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.30వేలు, రూ. 20వేలు,రూ.10వేలు, రూ. 5వేలు, రూ.3వేలను దాతల సహకారంతో అందజేస్తామన్నారు. అలాగే బెస్ట్ డ్రైవర్‌కు కూడా రూ.2వేలను అందజేస్తామని తెలిపారు. 30వ తేదీ సాయంత్రంలోగా రూ.500లు ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. పేర్ల నమోదుకు 97039 93872, 76759 19060 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
వెల్దుర్తి: ఈ నెల 27వ తేదీ (సోమవారం) నుంచి వచ్చేనెల 20వ తేదీ వరకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్థానిక కేజీబీవీ ఎస్ఓ షాకీరా బేగం తెలిపారు. స్థానిక కేజీబీవీలో 6వ తరగతికి 40 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ (ఎంపీసీ మాత్రమే)లో 40సీట్లు ఉన్నాయన్నారు. అనాథ పిల్లలు, బడి బయట, బడి మానేసిన పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలలోని పేద బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. apkgbv.apcfss.inఅనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు రామళ్లకోట రోడ్డులోని తమ కేజీబీవీలో సంప్రదించవచ్చన్నారు.

31వరకు గడువు పెంపు :
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం పొడగించినట్లు స్థానిక బాలికల ఎస్సీ గురుకులం ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసూన తెలిపారు. వివరాలకు తమ గురుకులంలో సంప్రదించాలన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వాల్మీకులు

ఎమ్మిగనూరుటౌన్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల వాల్మీకి నాయకులు, వైస్ ఎంపీపీ గుడికల్ పోలయ్య, నాగేష్‌నాయుడు, వీజీఆర్ కొండయ్య, కోటేకల్ గ్రామ సర్పంచ్ లక్ష్మన్న, యాపీలయ్య, మురళీ నాయుడులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఈమేరకు వాల్మీకులు స్థానిక ఫంక్షన్ హాల్‌లో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు పుండుకూర రంగన్న, బీటీ లక్ష్మన్న, ఎల్ఐసీ రంగస్వామి, యల్లంబీడు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ముగిసినా తొలగని ముసుగు



వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తీయని దృశ్యం

హొళగుంద: ఇటీవలే ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసాయి. ఎన్నికల కోడ్‌ను కూడా ఎత్తి వేశారు. అయితే హొళగుందలో మాత్రం కోడ్ ఎత్తివేసినా వైఎస్సార్ విగ్రహానికి వేసిన ముసుగును ఇంత వరకు తొలగించకపోవడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడుతున్నారు. వెంటనే అధికారులు వైఎస్సార్ విగ్రహానికి వేసిన ముసుగును తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు 22 మంది ఎంపిక

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థినులు ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైనట్లు ఆదివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌసియాబేగం తెలిపారు. పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థినులు కీర్తి, కీర్తన, మహాలక్ష్మి, శివజ్యోతి, రోజారమణి, సోమేశ్వరి, నందిని, శ్రావణి, శ్రీచందన, మేఘన, అశ్విని, ఉషశ్రీ, అఖిల, శ్యామల, దివ్య, రాజేశ్వరి, కెబిర, అంబిక, మయూరి, దీప్తి, ప్రమీళ, రుక్మిణిలు ఎంపికయారన్నారు. వీరికి నెలకు రూ.1000ల చొప్పున స్కాలర్‌షిప్ మంజూరు కానున్నట్లు తెలిపారు.

మిట్టసోమపురంలో నీటి ఎద్దడి



బోరు వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

నందవరం: మండల పరిధిలోని మిట్టసోమపురంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుకు ఏర్పాటు చేసిన మెయిన్‌పైపు లైన్‌కు కొంత మంది అక్రమంగా ఇంటి కుళాయిలు ఏర్పాటు చేసుకున్నారు.గ్రామంలో దాదాపు 14 మంది పైపులైన్‌కు కుళాయిలు అమర్చుకోవడం వల్ల బీసీ కాలనీ, కింద గేరి, పైగేరికి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఆయా కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ చివరిలో ఉన్న ప్రభుత్వ బోరు వద్ద నీటిని పట్టుకుంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి అక్రమ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసుకున్నవారిపై చర్యలు తీసుకోవడంతోపాటు నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.